కెమి'కిల్' ఎరువు.. ఆరోగ్యానికి ముప్పు

- ప్రకృతి వ్యవసాయానికి ఈటీసీ ప్రాధాన్యం
- సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ
- పచ్చదనంతో కళకళలాడుతున్న విస్తరణ శిక్షణ కేంద్రం



సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రం

సామర్లకోట: వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న ఉపద్రవాల నుంచి ఉపశమనం పొందడానికి వ్యవసాయ రంగంలో కీలక మార్పులు తేవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రకృతి, సహజ వ్యవసాయ పద్ధతిని అనుసరించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) అధికారులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టారు. శిక్షణకు హాజరయ్యే వారికి ఆహ్లాదకర వాతావరణం ఉండాలని.. శిక్షణ కేంద్రం పచ్చదనంతో నిండిపోయేలా వివిధ రకాల మొక్కలు వేశారు. సుమారు రూ.20 లక్షలతో ప్రధాన సీసీ రోడ్లను నిర్మించారు. గతేడాది నుంచి కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈటీసీ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తోటల పెంపకాన్ని చేపడుతున్నారు. ఫలసాయం ఇచ్చే వివిధ రకాల మామిడి మొక్కలు 201, పనస మొక్కలు తొమ్మిది, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్, సిలోన్ కోకోనట్ రెండు వంతున, సీతాఫలం పది, దబ్బ, సపోటా, మారెడు, వెలగ, జమ్మి ఒక్కొక్కటి వంతున, లక్ష్మణ ఫలం ఐదు, చక్కెరకేళి అరటి 64, ఎర్ర అరటి ఆరు, థాయ్‌లాండ్ జామి 110 మొక్కలు వేశారు. ఔషధ మొక్కలు 200, పూలు, ఆకు మొక్కలు 387, పార్కు రక్షణకు వాక్కాయ మొక్కలు 2,300 నాటించారు.



ఈటీసీలో సేంద్రియ ఎరువుతో పెరిగిన మామిడి చెట్లు



ఈటీసీ శిక్షణ కేంద్రంలో చక్కెరకేళి అరటి మొక్కలు

సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ

భూసార పరిరక్షణ మేరకు రసాయన ఎరువులు, పురుగు మందులు లేనివిధంగా దేశవాళీ గోమూత్రం, వేప కాషాయం, ఆవు పేడ, ఉలవ పిండి, బెల్లం వంటి పదార్థాలతో జీవామృతం, కాడామృతం తయారీపై శిక్షణ ఇస్తున్నారు. వీటితో ఈటీసీలో సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో తోటలను పెంచుతున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వానపాముల ద్వారా తయారు చేస్తున్న సహజ ఎరువునూ వినియోగిస్తున్నారు. శిక్షణ కేంద్రానికి వస్తున్న వారికి వీటిపై శిక్షణ ఇస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు ఈటీసీని క్షేత్ర స్థాయి ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. మట్టి నమూనా పరీక్షలు చేయించి, ఆయా భూముల్లో భూసారాన్ని పెంచడానికి ఏ ప్రకృతి ఎరువులు ఎలా వాడాలో సూచిస్తున్నారు.

నాణ్యత.. ఆరోగ్యం




విచ్చలవిడిగా ఎరువుల వాడకంతో పండిన పంటలతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచడానికి ఈటీసీలో శిక్షణ ఇవ్వడంతో పాటు, క్షేత్ర ప్రదర్శనలతో అవగాహన పెంచుతున్నాం. తక్కువ ఖర్చుతో కూడిన సేంద్రియ వ్యవసాయంతో పండిన పంటలు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి.

– జె.వేణుగోపాల్, ప్రిన్సిపాల్, ఈటీసీ, సామర్లకోట

మీలో ఒక్కడిని.. స్థానికుడిని.. గెలిపించండి

ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి దవులూరి



పెద్దాపురం వ్యాపారస్తులను ఓటు అభ్యర్థిస్తున్న దొరబాబు

పెద్దాపురం: స్థానికుడిగా నియోజకవర్గ ప్రజలకు చేరువగా ఉన్న నాకు జగనన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమిచ్చారు, మీలో ఒక్కడినైన నన్ను ప్రతిఒక్కరూ ఆదరించండి, ఈ ఎన్నికల్లో గెలిపించండంటూ వైఎస్సార్ సీపీ పెద్దాపురం అసెంబ్లీ అభ్యర్థి దవులూరి దొరబాబు అభ్యర్థించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత ఆదివారం తొలిసారి మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ సెంటర్ నుంచి భారీగా కార్యకర్తలతో కలిసి మెయిన్ రోడ్డులోని వ్యాపారులను కలిసి, ఓటు వెయ్యాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి గుడి వద్ద ఆయన ప్రచార వాహనం నుంచి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించుకోవాలన్నారు. పార్టీరహితంగా అర్హులందరికీ నవరత్నాలు పథకాల ద్వారా సంక్షేమాన్ని అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే, మరోదఫా ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి 121 సార్లు బటన్ నొక్కారని, సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు రెండుసార్లు ఫ్యాన్ గుర్తుకు బటన్ నొక్కి వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించాలన్నారు. స్థానిక అభ్యర్థికి 20 ఏళ్ల నిరీక్షణ అనంతరం అవకాశం వచ్చిందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆదరించి, స్థానికుడైన తనను ఎమ్మెల్యేగా, కాకినాడ పార్లమెంటరీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్‌ను ఓటేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, మరో వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీలు పెంకే సత్యవతి, బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సొసైటీ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, పట్టణ అధ్యక్షుడు కాపగంటి కామేశ్వరరావు, గోపు మురళి, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, ఆకుల కృష్ణబాపూజీ, విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, గడపా శివ, పెంటా విజయ్‌కుమార్, తాడి రాజశేఖర్, కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు, నాగబోయిన రాజుబాబు, లక్కాకుల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ముఖ్యమంత్రి పెద్దపీట

రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి



సామర్లకోట: దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేలకు పెద్ద పీట వేశారని రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి అన్నారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 175 అసెంబ్లీ స్థానాల్లో బీసీలకు 48 సీట్లు కేటాయించి రికార్డు సృష్టించారని తెలిపారు. వీటిలో 19 సీట్లు మహిళలకు కేటాయించడం అభినందనీయమని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకూ ముఖ్యమంత్రి ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. ఎస్సీలకు 29, ఎస్టీలకు 7, మైనార్టీలకు ఏడు అసెంబ్లీ టిక్కెట్లు ఇచ్చారని వివరించారు. హామీలు ఇవ్వడమే కాదు, వాటిని అమలు చేయడమూ తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మరోసారి నిరూపించుకున్నారన్నారు. ఆయనను ఎదుర్కోలేకే మూడు పార్టీలు ఒక్కటై పోటీ చేస్తున్నాయని చెప్పారు. పేదలకూ, పెత్తందార్లకూ మధ్య జరిగే ఈ సమరంలో పేదల పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్నదని చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదన్నారు. అందుకే జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని అనేక పథకాలను ప్రజల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని తెలిపారు. పేదల పిల్లలు పెద్ద చదువులు చదువుతున్నారంటే దానికి కారణం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో స్థానిక అభ్యర్థి దవులూరి దొరబాబుకు టిక్కెట్ కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. స్థానిక అభ్యర్థి ఎమ్మెల్యే అయితే ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉంటుందన్నారు. స్థానికేతరుల కారణంగా పెద్దాపురం నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుగర్ ఫ్యాక్టరీ మూతపడటానికి, పంచారామ క్షేత్రం అభివృద్ధి చెందక పోవడానికి స్థానికేతర ఎమ్మెల్యేలే కారణమని ఆరోపించారు.

అపర్ణాదేవి నమామ్యహం..!



తాటిపర్తిలో అపర్ణాదేవికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు
- వేలాదిగా తరలివచ్చిన మహిళా భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కుంకుమ పూజలకు సుమారు మూడు వేల మంది మహిళలు తరలివచ్చారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకర శాస్త్రీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మహిళలు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, సహస్ర తులసిపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు ఆలయ అధికారులు అన్నదానం ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు



విరవలో చింతాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గ్రామాల్లో ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉండే ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం మండలం విరవ గ్రామదేవత చింతాలమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పిఠాపురం మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నడిగట్ల చింతలరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సాకారం కానున్న శెట్టిబలిజల కల

ఎమ్మెల్యే ద్వారంపూడికి సంఘ పెద్దల కృతజ్ఞతలు



ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసిన శెట్టిబలిజ సంఘ నాయకులు

కాకినాడ: జిల్లా కేంద్రంలో శెట్టిబలిజ కులస్తుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవాలన్న దశాబ్దాల కలను సాకారం చేసే దిశగా తోడ్పాటునందించిన సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి జిల్లా శెట్టిబలిజ సంక్షేమ సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది. శెట్టిబలిజ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గెద్దాడ వెంకటేశ్వరరావు, ఇతర సంఘ పెద్దలు ఆదివారం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జీవో ఎంఎస్ నంబర్ 140 తేదీ 16-3-2024 ద్వారా కాకినాడ డెయిరీ ఫారం సెంటర్ సమీపంలోని రెవెన్యూ కాలనీ వద్ద 630 గజాల స్థలాన్ని కేటాయించడంపై ధన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు గెద్దాడ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ చిరకాల వాంఛగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ కల ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చొరవతో సాకారం కాబోతోందన్నారు. ఎన్నో దశాబ్దాలుగా, ఎంతోమంది రాజకీయ నాయకులను కలిసి వేడుకున్నప్పటికీ స్థల కేటాయింపు జరగలేదన్నారు. సంఘం తరపున తామిచ్చిన లేఖపై స్పందించిన ద్వారంపూడి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు సహకారంతో ఎంతో శ్రమించి, ఉత్తర్వులు విడుదల చేయించారని చెప్పారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే భవన నిర్మాణం కూడా పూర్తికావాలని, అందుకు తనవంతు తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జెడ్పీటీసీ గుబ్బల తులసీ కుమార్, శెట్టిబలిజ ప్రముఖులు పితాని నూకరాజు, రెడ్డి రామ పల్లంరాజు, అంజి బాబు తదితరులున్నారు.

కేంద్ర పోలీసు బలగాల కవాతు



గొల్లప్రోలులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర పోలీసు బలగాలు

పిఠాపురం: మీకు రక్షణగా మేముంటాం.. మీ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి అంటూ ఆదివారం పిఠాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పోలీసులు ప్రచారం చేశారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించి ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కాకినాడ డీఎస్పీ కె.హనుమంతరావు ఆధ్వర్యంలో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో కేంద్ర సీఐఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు గొల్లప్రోలు నగర పంచాయతీలో భారీ కవాతు నిర్వహించారు. నగర పంచాయతీలోని ముఖ్య కూడళ్లలో లౌడ్ స్పీకర్ల ద్వారా ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గొల్లప్రోలు ఎస్సై బాలాజీ, పోలీసులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఉద్యమానికి మద్దతు

- ఓఎన్‌జీసీ పరిహారం అందేలా కృషి
- వాకలపూడిలో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కాకినాడ తీర ప్రాంతంలో క్రూడాయిల్ వెలికితీత కోసం ఓఎన్‌జీసీ ఆంక్షల నేపథ్యంలో ఆందోళనలో ఉన్న మత్స్యకారులు ఉద్యమం బాట పట్టిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో వాకలపూడికి చెందిన సుమారు 400 మంది మత్స్యకారులు రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబును కలిసి తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. తమ జీవనోపాధికి భంగం వాటిల్లేలా ఓఎన్‌జీసీ ఆంక్షలు విధించేలా ఉందని, పరిహారం అందించేందుకు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ కాకినాడలో మత్స్యకారులు ఆందోళనకు తనతో పాటు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మద్దతు ఇచ్చి, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కాకినాడ మత్స్యకారులతో పాటు, రూరల్ నియోజకవర్గంలోని సూర్యారావుపేట, లైట్ హౌస్, వాకలపూడి, పగడాలపేట, ఉప్పలంక తదితర గ్రామాలకు చెందిన మత్స్యకారులు కమిటీలో ఉంటారన్నారు. కాకినాడ తీరంలో ఓఎన్‌జీసీ సర్వే ప్రాంతంలో 35 కి.మీ. మేర నిషేధంతో పాటు, 500 కి.మీ. మేర చేపల వేట సాగించరాదనే ఆంక్షలున్నట్టు తెలిసిందని, ఇదే జరిగితే మత్స్యకారుల జీవనోపాధికి విఘాతం కలుగుతుందన్నారు. మత్స్యకారులకు పరిహారం అందేలా రాజకీయాలకతీతంగా మద్దతు తెలుపుతున్నామన్నారు. వారికి మంచి జరిగేలా చూస్తామన్నారు. వేట నిషేధ భృతి అందుకుంటున్న వారికీ పరిహారం అందే అవకాశం ఉంటుందన్నారు. మత్స్యకార నాయకులు పెద అబ్బాయి, సింహాద్రి, అప్పారావు, కాసయ్య, కాశీ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి జగన్, కాశీ, గంపల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

20న పాదగయలో హుండీల ఆదాయం లెక్కింపు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలోని హుండీల ఆదాయాన్ని నెల 20న లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి ఆదివారం తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు సిబ్బందితో పాటు భక్తుల సమక్షంలో హుండీలను తెరిచి ఆదాయాన్ని లెక్కిస్తామని చెప్పారు.

19 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పిఠాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

పిఠాపురం: పట్టణంలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకూ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఫ్లెక్సీల తొలగింపు, విగ్రహాలకు ముసుగులు



సామర్లకోటలో సిబ్బంది తొలగించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు

సామర్లకోట: ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి రావడంతో అన్ని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, పోస్టర్ల తొలగింపు ప్రక్రియ ఆదివారం మొదలైంది. ఆయా రాజకీయ నాయకుల విగ్రహాలకూ ముసుగులు వేసే కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ జె రామారావు ఆదేశాల మేరకు పట్టణంలో టౌన్ ప్లానింగ్ అధికారి ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసుల పర్యవేక్షణలో ఫ్లెక్సీల తొలగింపు ప్రారంభించారు. ఫ్లెక్సీలను స్వయంగా తొలగించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో రాజకీయ నాయకులు ఫొటోలుంటే తొలగించాలని కమిషనర్ సూచించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

కరప: ప్రముఖ వైద్యులు ముమ్మిడి శ్రీరామారావు, నున్న నరసింహారావు జ్ఞాపకార్థం స్థానిక చిరంజీవి కల్యాణ మంటపంలో ఆదివారం ప్రవాసాంధ్ర వైద్య నిపుణుల సంఘానికి చెందిన ఎముకల వ్యాధి నిపుణుడు డాక్టర్ బొండా సూర్యారావు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా డాక్టర్ శ్రీరామారావు, డాక్టర్ నరసింహారావు చిత్రపటాలకు వైద్యులతో కలిసి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. కరప, పరిసర గ్రామాల నుంచి సుమారు 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన 14 మంది వైద్య నిపుణులు సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

30న రన్ ఫర్ జీసెస్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండగను పురస్కరించుకుని ఈ నెల 30న రన్ ఫర్ జీసెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఏఐసీసీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రిక్కిగూటం ఆదివారం ఇక్కడ ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా పరిధిలో నిర్వహించే ఈ రన్ ఉదయం ఆరు గంటలకు భానుగుడి జంక్షన్ నుంచి ప్రారంభమై, ఆనందభారతి గ్రౌండ్ వరకూ జరుగుతుందన్నారు. దీని పోస్టర్‌ను కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించనట్టు తెలిపారు.

స్పందన, డయల్ యువర్ కమిషనర్ రద్దు

కాకినాడ: సోమవారం జరగాల్సిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను రద్దు చేసినట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వచ్చినందున ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించాల్సిందిగా కమిషనర్ కోరారు.

టెన్త్ పరీక్షలకు 2,205 మంది విద్యార్థులు



సామర్లకోట జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎంఈఓ

సామర్లకోట: మండలంలో 2,205 మంది విద్యార్థులు సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు రాయనున్నట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ హైస్కూల్‌లో 210 మంది, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 200 మంది, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 290 మంది ప్రతిభా విద్యా నికేతన్‌లో 290 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని వివరించారు. అలాగే మండలంలో వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్-ఎలో 280 మంది, వేట్లపాలెం-బి సెంటర్‌లో 300, నవర జెడ్పీ హైస్కూల్‌లో 170, వీకే రాయపురంలో 230, ఉండూరులో 235 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. వీరిలో 1,620 మంది రెగ్యులర్, 585 మంది ప్రైవేటు విద్యార్థులున్నారని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో హెల్త్ సిబ్బందిని నియమించామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

సామర్లకోట: పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న తరుణంలో ఆదివారం సాయంత్రం స్థానిక బ్రౌన్‌పేటలో ఉన్న జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తనిఖీ చేశారు. హెచ్ఎం మీనామాధురి పదో తరగతి విద్యార్థులకు ఆదివారం అదనపు తరగతులు నిర్వహించి, పలు సూచనలు ఇచ్చారు. ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని ఎంఈఓ సూచించారు.

మైక్రో జిరాక్స్ తీస్తే సెంటర్ సీజ్

సామర్లకోట: విద్యార్థుల పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, వారికి సంబంధించిన పాఠ్యాంశాలను మైక్రో (సూక్ష్మ) జిరాక్స్ తీస్తే ఆయా జిరాక్స్ సెంటర్లను సీజ్ చేస్తామని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య హెచ్చరించారు. కొన్ని జిరాక్స్ సెంటర్లలో మైక్రో జిరాక్స్ కాపీలు తీయిస్తున్నట్టు తన దృష్టికి వచ్చాయన్నారు. స్లిప్పులతో విద్యార్థులు పట్టుబడితే డిబార్ తప్పదన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా జానీమోజెస్



జానీమోజెస్‌ను సత్కరిస్తున్న దవులూరి దొరబాబు


సామర్లకోట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శిగా మైలాబత్తుల జానీమోజెస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం పార్టీ పెద్దాపురం అసెంబ్లీ అభ్యర్థి దవులూరి దొరబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి దొరబాబు కృషి చేశారన్నారు. నియోజకవర్గంలో దొరబాబు అత్యధిక మెజార్టీతో విజయం సాధించేలా తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జానీమోజెస్‌ను దొరబాబు సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మాల మహానాడు నాయకుడు బీపీఎల్ పండు తదితరులు పాల్గొన్నారు.

నీడ ఇచ్చిన విడోస్ హోమ్

నేడు పైండా రామకృష్ణయ్య వర్ధంతి



కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు



పైండా రామకృష్ణయ్య(ఫైల్)

బోట్‌క్లబ్: నిలువ నీడ లేని రోజుల్లో వితంతువుకు విడోస్ హోమ్ చోటు కల్పించింది. ఆ దాత ఆశయాలకు అనుగుణంగా మహిళలు నేడు స్వయం ఉపాధి సాధించేలా ఉచిత కుట్టు శిక్షణ పొందుతున్నారు. కాకినాడ మెయిన్ రోడ్డులోని విడోస్ హోమ్‌ను పైండా రామకృష్ణయ్య జమీందారు 1898లో ఏర్పాటు చేశారు. అప్పట్లో ఎంతో మందికి ఇది ఉపయోగపడేది. కాలక్రమేణా శిథిలమైన ఈ హోమ్‌ను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకుంది. దాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు చేయాలనే దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు రెండేళ్లుగా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించారు. ఇద్దరు అనుభవజ్ఞులను నియమించి, రోజుకు రెండు బ్యాచ్‌లలో శిక్షణ ఇస్తున్నారు. ఒకొక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ కొనసాగుతోంది. దాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని విడోస్ హోం చైర్మన్ పైండా రామకృష్ణారావు తెలిపారు. శిక్షణానంతరం వితంతువులకు కుట్టుమెషీన్లు అందిస్తున్నామన్నారు. కాగా సోమవారం పైండా రామకృష్ణయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక సాంబమూర్తినగర్‌లోని మహర్షి బులుసు సాంబమూర్తి దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.